క్లుప్తంగా

1,161 మందికి మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: మండలంలో షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలు కొనసాగుతున్నట్లు పీహెచ్‌పీ డాక్టర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రామయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోప్లాపూర్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను సీహెచ్‌ఓ రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటిన వారందరూ పరీక్షలు చేయించుకొని సిబ్బందికి సహకరించాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 1,161 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అవగాహన



పాన్‌గల్: ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంగళవారం మండలంలోని మాధరావుపల్లిలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈ విఠోబా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకునేలా నమూనాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ గోవింద్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి

వనపర్తి విద్యావిభాగం: బీసీ సమాజ్ వనపర్తి జిల్లా కన్వీనర్‌గా పలుస శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో పలుస శ్రీనివాస్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టిన రాష్ట్ర న్యాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీలను ఏకం చేసి, బీసీ భావజాల వ్యాప్తికి జిల్లా మొత్తం కృషి చేస్తానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్ ఉన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

చిన్నంబావి: యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఎస్ఐ జగన్మోహన్ అన్నారు. యువత ప్రభుత్వ కొలువులే లక్ష్యంగా చేసుకుని కాలాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. సాధించాలనే లక్ష్యం ఉంటే ఏ రంగంలోనైనా స్థిరపడొచ్చన్నారు. చిన్న వ్యాపారంతో మొదలు పెట్టిన ఎందరో కొన్ని వందల మందికి ఉద్యోగాలు అందించే స్థితికి చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందడుగు వేయాలని సూచించారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



అమరచింత: భవన నిర్మాణ, గుర్తింపు కార్డులు కలిగిన ఇతర కార్మికులకు కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులకు షుగర్, గుండె, ఉదర సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు కలిగిన కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం'



వనపర్తి టౌన్: అబద్ధపు హామీలు ఇచ్చి చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు రూ. 15వేలు, రైతు కూలీలకు రూ.12వేల ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, కుమారస్వామి, రాజశేఖర్‌గౌడ్, ఆగుపోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర వైద్యం అందేనా?



పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- అత్యవసర సమయాల్లో తప్పని ఇబ్బందులు
- మండలంలో ఒకే ఒక్క పీహెచ్‌సీతో పేదలకు అందని వైద్యం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు లేక స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో సుమారు 45 వేల మంది జనాభా ఉన్నారు. మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే రోగులకు సేవలు అందుతున్నాయి. సాయంత్రం, రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు డాక్టర్ల వద్దకు, జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. నిత్యం సుమారు 100కు పైగా రోగులు ఓపీ సేవలకు వస్తారు. సీజనల్ వ్యాధుల కాలంలో ఇది ఇంకా ఎక్కువగా ఉంటోంది.

అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు జరిగేనా..

కేతేపల్లిలో అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే మండల కేంద్రంలోని పీహెచ్‌సీపై భారం తగ్గుతుందని అధికారులు విన్నపించినా.. ఇంకా ఆ దిశగా అడుగులు పడట్లేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందించేందుకు మండలంలోని రేమద్దుల, అన్నారం, చింతకుంట, మాందాపూర్, తెల్లరాళ్లపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లను నియమించారు. కానీ వారు సమయ పాలన పాటించకపోవడం, మధ్యాహ్నం వరకే కేంద్రాలు మూతపడటంతో ప్రజలకు నిరాశే మిగిలింది.

సమస్యలు.. ఖాళీ పోస్టులు

పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మరొక డాక్టర్ డిప్యూటేషన్‌పై కడుకుంట్ల పీహెచ్‌సీలో, ల్యాబ్ టెక్నీషియన్ డిప్యూటేషన్‌పై కొత్తకోట పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఇబ్బందులు తప్పడంలేదు. పీహెచ్‌సీలో మొదటి ఏఎన్ఎంలు 4 పోస్టులు, రెండవ ఏఎన్ఎంలు 2 పోస్టులు, స్టాఫ్ నర్సు ఒక్కరు, ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఫార్మసిస్టు, సీహెచ్‌ఓ పోస్టులు, ఇద్దరు సూపర్‌వైజర్ల పోస్టులు, అటెండర్, స్వీపర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీలో నీటి సంపు ఉన్న ఆస్పత్రి పైన ఉన్న ట్యాంకర్లకు నీటిని సరఫరా చేసే మోటార్ ఏర్పాటు చేయకపోవడంతో నీటికి ఇబ్బందిగా ఉంది.

అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



మండలంలో 50 వేల వరకు జనాభా ఉన్నా ఒకే పీహెచ్‌సీ ఉండడంతో రోగులకు సరైన వైద్యం అందట్లేదు. కేతేపల్లిలో అదనపు పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే సగం గ్రామాలు ఈ పీహెచ్‌సీ పరిధిలోకి వచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్యను పరిష్కారం చేయడంలేదు. – కళావతమ్మ, కేతేపల్లి

అప్‌గ్రేడ్ చేయాలి



మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 24 గంటల ఆస్పత్రిగా మారిస్తే అత్యవసర సమయంలో పేదలకు మెరుగైన వైద్యం అందుతుంది. దీంతో పాటు పీహెచ్‌సీలో నెలకొన్న నీటి సమస్య, ఖాళీ పోస్టుల భర్తీకి తగు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా తగు చర్యలు తీసుకోవాలి. – సూర్యవంశంరాము, బుసిరెడ్డిపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం



పీహెచ్‌సీలో ఖాళీ పోస్టుల వివరాలు, 24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశాం. పీహెచ్‌సీలోని సంపులో మోటార్‌ను బిగించి నీటి సరఫరా చేస్తాం. మండలంలో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులపై పర్యవేక్షణ పెంచి, ప్రజలకు సక్రమంగా వైద్యం అందేలా చూస్తాం. నిబంధనలు పాటించని సిబ్బంది వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తాం. – డా.చంద్రశేఖర్, వైద్యాధికారి, పాన్‌గల్

శివరాత్రికి 'కోటిలింగాల' ముస్తాబు

- బోలాశంకరుడికి ప్రత్యేక పూజలు



విద్యుద్దీపాల వెలుగుల్లో కోటిలింగేశ్వరస్వామి ఆలయం

కొత్తకోట రూరల్: శివుడు అభిషేక ప్రియుడు.. శివలింగంపై దోసెడు నీళ్లు చాలు పరవశించిపోయి కోరిన వరాలు ఇచ్చే బోలాశంకరుడు. ఇంతటి మహిమ కలిగిన శివలింగాన్ని మహాశివరాత్రి రోజున దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మండలంలోని కానాయపల్లి శివారులోని కోటిలింగేశ్వర దత్త దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ కొద్దికాలంలోనే మరో శ్రీశైల క్షేత్రాన్ని తలపిస్తోంది. భక్తులు భక్తితో శివలింగాన్ని దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు నిర్వహించడం ఇక్కడ నిత్య కొనసాగుతుంది. అంతే కాకుండా ధ్యాన మందిరంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన పాదరస సమిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగం భక్తులను ఆకట్టుకుంటుంది.

కార్యక్రమ వివరాలు

మహాశివరాత్రి రోజు ఉదయం 5గంటల నుంచి జ్ఞానాంబికా దేవి సమేత కోటిలింగేశ్వరస్వామి వారి దర్శనం, అభిషేకాలు, అర్చనలు, 7గంటలకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి మంగళవాయిద్యాలతో తీసుకెళ్లడం, 8గంటలకు లోక కల్యాణార్థం అంగరంగ వైభవంగా ఆదిదపంతులైన శివపార్వతుల కల్యాణం జరిపిస్తారు. రాత్రి 10గంటలకు ప్రముఖ గాయకులచే భక్తి ప్రధానమైన గీతాలతో భజనలు, కుమారిక శ్రీహర్షిణి భరత నాట్యం, రాత్రి 11గంటలకు అన్నదాతలు, శాశ్వత దాతలచే ధ్యానమందిరంలో మహాసంకల్పంతో రుద్రపఠనంతో కలశపూజలు చేస్తారు. అన్నదానం కోసం రూ.3వేలు చెల్లించిన భక్తులచే కోటిలింగాల యంత్ర ప్రతిష్ఠ చేయిస్తారు. అనంతరం లింగోద్భవం. తెల్లవారుజామున 2గంటల నుంచి నందికోళ్ల సేవ, వీరభద్రసేవ, తెల్లవారుజామున 4గంటలకు భక్తులచే అగ్నిగుండ ప్రవేశం, మహామంగళహారతి జరిపిస్తారు.



ధ్యాన మందిరంలో కొలువైన స్వర్ణ కవచ పంచలోహ శివలింగం

ఏర్పాట్లు పూర్తి

శ్రీకోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో జరుగనున్న మహాశివరాత్రి మహోత్సవ వేడుకలకు ఆలయ నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవాలయానికి శోభాయమానంగా రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సరఫరా, క్యూలైన్, అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్

కొత్తకోట: పెబ్బేరు మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య అందుతున్న, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ తూర్పింటి నరేశ్‌కుమార్ అన్నారు. మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షపై మండలంలోని వివిధ గ్రామాల్లో కంచిరావుపల్లి, శేరుపల్లి, కిష్టారెడ్డిపేట, చెలిమిల్ల, కొత్తకోట మండలంలోని నాటవెల్లి, నాటవెల్లితండా, మిరాశిపల్లి, విలియంకొండ, ముమ్మాళపల్లి, బునాదిపురం, రంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశాలమయిన ప్రాంగణంలో మోడల్ స్కూల్ ఏర్పాటు, నిపుణులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హఫీజ్, రవికుమార్, హేమలత, కమలాకర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని, శుభ్రతను పాటించాలని, కుళ్లిన కూరగాయలను వాడకూడదని ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాం రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యహ్న భోజనం చేశారు. అనంతరం హాజరు పట్టికలను తనిఖీ చేశారు. అనంతరం కత్తేపల్లి నర్సరీని పరిశీలించారు.

భిక్షాటన చేస్తున్న చిన్నారులకు విముక్తి



చిన్నారుల తండ్రికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఆర్డీఎస్ ప్రతినిధులు

కొత్తకోట రూరల్: మండలంలోని ముమ్ముళ్లపల్లికి చెందిన శివ, తన ముగ్గురు చిన్నారులతో భిక్షాటన చేయిస్తూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతున్నాడని, పిల్లలను చదువుకు దూరం చేసి నిర్లక్ష్యం చేస్తున్నాడని కొందరు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధి మండల ఇన్‌చార్జ్ హరికృష్ణకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్డీఎస్ సొసైటీ ప్రతినిధులు షాపుల వెంట చెత్తకుప్పలలో తిరుగున్న చిన్నారుల దగ్గరకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. తండ్రే వారితో భిక్షాటన చేయిస్తున్నాడని నిర్ధారణకు వచ్చిన ఆర్డీఎస్ ప్రతినిధులు.. చిన్నారుల తండ్రి శివ కు కౌన్సెలింగ్ చేసి ముమ్మల్లపల్లి గ్రామానికి తీసుకెళ్లి పంచాయతీ కార్యదర్శి ఓమేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మికి తెలియచేశారు. దీంతో పాటు ఇప్పటి నుంచి పిల్లలను చదువుకు దూరం చేసి భిక్షాటనకు పంపిస్తే తండ్రి శివ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు. సమాచారం అందించిన వెంటనే వచ్చి చిన్నారులకు విముక్తి కలిగించిన ఆర్డీఎస్ ప్రతినిధులను పలువురు అభినందించారు.

'వలసదారులకు సంకెళ్లు వేయడం సరికాదు'



మాట్లాడుతున్న నాయకులు

వనపర్తి రూరల్: అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించారని భారతీయులకు సంకెళ్లు వేసి విమానంలో దేశానికి తరలించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్ద కేంద్ర ప్రభుత్వం నిరసన కూడా వ్యక్తం చేయలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయుల కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి దేశానికి తరలించిన చరిత్ర గతంలో ఎన్నడూ లేదన్నారు. తాము దేశ భక్తులమని, దేశ గౌరవాన్ని కాపాడతామని బీజేపీ గొప్పలు చెబుతుందని, కానీ వాస్తవంలో దేశ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలోని 27 గ్రామ శాఖల సమావేశాలు ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని, సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం మార్చి 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామన్నారు. కనీసం 500 మందిని సమీకరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో చంద్రయ్య, విజయరాములు, కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, మోష, సీఎస్‌శెట్టి, రవీందర్, గోపాలకృష్ణ, కుతుబ్, హరత్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

వనపర్తి రూరల్: రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, విద్యను అభివృద్ధికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మల్లేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా రెండో మహాసభను ఆయన ప్రారంభించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యారంగం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే జాబ్ క్యాలెండర్ ప్రకటించిన విధంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, డీవైఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్ననాయక్, రమేష్, మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుండటంతో తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందన్నారు. తండా పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా, శాస్త్రవేత్తలుగా దేశ సేవ చేస్తున్నారని కొనియాడారు. పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థిని శివమణి వివిధ రాష్ట్రాలు, రాజధాని పేర్లు చెప్పడంతో విద్యార్థిని అభినందించారు. ఈ మేరకు గిరిజన నాయకుడు బాల్యానాయక్ విద్యార్థినికి రూ.1000 నగదు అందజేశారు. అనంతరం తల్లిదండ్రులను సన్మానించారు.

భగవద్గీత బోధించిన జగద్గురువు శ్రీకృష్ణుడు



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

వనపర్తి రూరల్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక మదిగట్ల కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్రాచారి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అచ్యుతాపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు శివరాత్రి ప్రాముఖ్యత వివరించారు. శివలింగం పైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, పరమాత్మలకు గుర్తు అని ఆత్మను ఆదరిస్తే జీవుడు మోక్షం పొందుతాడాని వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు సుదర్శన్, మహేష్, మనోహర్, బాలరాజు, రమేష్, మంజుల, కాలమ్మ, సబిత, ఈశ్వరమ్మ, మనెమ్మ, శివలీల, సువర్ణ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం సమాజహితానికి పాటుపడాలి

కొత్తకోట: జర్నలిజం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని, అలాంటి జర్నలిజం సమాజహితానికి ఉపయోగపడాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం యూనియన్ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టు సమాజానికి ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే స్పందించి సహాయం చేసే యూనియన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు యూనియన్ పరంగా ఆదుకొని, బాధిత కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించడంతో పాటు, పిల్లలకు ఉచిత విద్య కల్పించడం, ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యుడు మల్యాల బాలస్వామి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీ రాజు, కొత్తకోట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాములు, జిల్లా కార్యదర్శి నాకొండ, జర్నలిస్టులు విజయ్, నరసింహారాజు, ఖాజామైనోద్దీన్, అంజి, అరుణ్, ధనుష్, తిరుపతిరెడ్డి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఆత్మకూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూర్: మోట్లంపల్లి, బాలకిష్టాపూర్, ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సాయంత్రం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు అలరించాయి.

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వమించారు. డీఈఓగా రాజు, ఎంఈఓగా భానుకుమార్, హెచ్ఎంగా హైమావతి, మరో 20 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమన్నార్‌సింగ్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవమ్మ, శివ శంకర్, ఉమావతి, పార్వతి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వెండి ధారపాత్ర విరాళం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలోని మరకత లింగేశ్వర స్వామికి మూడున్నర కిలోల వెండి ధారాపాత్రను మారం విజయ్, ప్రశాంతి దంపతులు మంగళవారం ఆలయ అధ్యక్షుడు నగేష్, వెంకన్న కు అందజేశారు. కార్యక్రమంలో చెన్నయ్య స్వామి, ఓల్డ్‌ఏజ్ హోం రాము, ఆర్పీ రవిసాగర్, అర్చకుడు సందీప్ శర్మ, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శివ శంకర్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంతర్‌రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘం నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేత జట్టుకు ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.40 వేలు, నాల్గో బహుమతి రూ.30 వేలు, ఐదో బహుమతి రూ.20 వేల నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం .97047 08270, 97034 44763ను సంప్రదించాలని కోరారు.

సమాచార హక్కు చట్టం అవగాహన కల్పిస్తాం

చిన్నంబావి: సమాచర హక్కు చట్టం మండల అధ్యక్షుడిగా అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నక్క సుధాకర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, జిల్లా నాయకులు మహేష్‌గౌడ్, దర్గేష్ తదితరుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు సుధాకర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా సమాచర హక్కు చట్టంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ప్రజలకు సలహాలు అందిస్తామని తెలిపారు. త్వరలో గ్రామాలలో పర్యటిస్తామని పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ రాష్ట్ర కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో సీపీఎస్ విధానం రద్దు చేయాలని, యూపీఎస్‌పై యుద్ధభేరి ప్రకటిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మార్చి 2న చేపట్టబోయే ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సంఘం నాయకులు విడుదల చేశారు. సమావేశంలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి మోహన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, రమేష్, బండి శ్రీను, ఈశ్వర్, మల్లికార్జున్, మహేశ్వర్‌చారి, నరేష్, కిరణ్, సురేష్, శివ, నరసింహ, స్వామి తదితరులు ఉన్నారు.

సీపీఎస్ రద్దుకు యుద్ధభేరి

ఆత్మకూర్: సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం ఉధృతం చేస్తామని, మార్చి 2న జరిగే యుద్ధభేరికి ఉద్యోగులు తరలిరావాలని టీఎస్‌సీపీఎస్ఈయూ సంఘం రాష్ట్రకార్యదర్శి మోహన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ గౌస్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో యుద్ధభేరి వాల్‌పోస్టర్లను ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎం మద్దిలేటి, సూపరింటెండెంట్ పార్వతమ్మ, ఉద్యోగులు నితీన్, రమేష్, చెన్నయ్య, జయమ్మ, తివేణి తదితరులు పాల్గొన్నారు.